

ఆంధ్రజ్యోతి
5
మంచిర్యాల
జిల్లా వార్తలు
మంగళవారం 29 అక్టోబరు 2024





రశీదు పుస్తకాలు మాయం..

మంచిర్యాల మున్సిపాలిటీలో తరుచుగా అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. వివిధ రకాల పన్నుల రూపేణ ప్రజల నుంచి వసూలు చేసిన నగదును ఉద్యోగులు సొంతానికి వాడుకోవడం ఇక్కడ షరా మామూలైంది. పెద్ద మొత్తంలో సొమ్ము మాయం అయిన విషయం ఆడిట్ సందర్భంగా వెలుగు చూడటంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు.

- రూ. 25 లక్షల మున్సిపల్ కలెక్షన్ పక్కదారి
- సొంతానికి వాడుకున్న ఉద్యోగులు
- తరుచుగా ఇదే తంతుతో అనుమానాలు
- బయటకు పొక్కకుండా సర్దుబాటు చేస్తున్నవైనం

మంచిర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో సిబ్బంది నీటిపన్ను, ట్రేడ్ లైసెన్సుల వసూళ్ల సమయంలో ఇచ్చే రశీదులను కొందరు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మాయం చేశారు. మాయమైన రశీదుల విలువ రూ.15 లక్షలు కాగా అంత మొత్తం పక్కదారి పట్టేవరకు అధికా రులు గమనించకపోవడం కొసమెరుపు. వినియోగదారులకు రశీదులు ఇచ్చి, అదే రోజు సాయంత్రం నగదు, బిల్లు బుక్కులను అధికారులకు అప్పగించాలి. అయితే సంవత్సరాల తరబడి బిల్లు బుక్కులు చూపకపోయినా పట్టించుకోక పోవడంతో పెద్ద మొత్తంలో నగదు పక్క దారి పట్టింది. ఫీజుల వసూళ్లకు సంబంధించిన రశీదు పుస్తకాలను 2020 మార్చిలో పర్మినెంట్ ఉద్యోగులతో పాటు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి అప్పగించారు. నిబంధ నల మేరకు రశీదు పుస్తకాలను ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఇవ్వరాదు. పన్ను వసూలు డిమాండ్ ఎక్కువగా ఉండ టంతో అధికారులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ అప్పగించారు. వాటితో బిల్లులు వసూలు చేసిన ఉద్యోగులు అనంతరం పుస్తకాలనే మాయం చేశారు. సొమ్ము మాయమైనట్లు తెలుసుకున్న అధికారులు ఎలాగోలా తంటాలు పడి అందులో కొంత వసూలు చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నరేష్ సొంతానికి వాడుకున్న రూ.3.40 లక్షల నుంచి పెద్ద మొత్తంలో అధికారులే భరించారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం, మాయమైన సొమ్ము వసూలు కాకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో అధికారులు చెల్లించడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం నరేష్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు.

ఎన్ఎంఆర్ ఉద్యోగి చేతివాటం

తాజాగా మరో అవినీతి వెలుగు చూసింది. మున్సి పాలిటీలో క్యాషియర్‌గా పని చేసే ఎన్ఎంఆర్ (నామి నల్ మాస్టర్ రోల్) ఉద్యోగి నర్సింగరావు రూ.10 లక్షలు స్వాహా చేశాడు. యేడాది కిందట ఇక్కడ పని చేసిన యాకుబ్ అనే బిల్ కలెక్టర్ సాధారణ బదిలీపై మరో మున్సిపాలిటీకి వెళ్లారు. ఆ సమయంలో అతని వద్ద ఉన్న బిల్లింగ్ హ్యాండ్ మిషన్‌ను ఇన్‌చార్జి క్యాషియర్‌గా పని చేస్తున్న నర్సింగరావుకు అప్పగించారు. ఆ బిల్లింగ్ మిషన్ నుంచి నర్సింగారావు ప్రజల నుంచి బిల్లులు వసూలు చేయడం ప్రారంభించాడు. అలా వసూలు చేసిన సొమ్మును మున్సిపాలిటీకి చెల్లించకుండా సొంతంగా వాడుకున్నాడు. విషయాన్ని పసిగట్టిన అధికా రులు ఎలాగోలా స్వాహా చేసిన సొమ్మును అతనితోనే కట్టించారు. అనంతరం అతన్ని తప్పించి మొక్కల పెంప కం పర్యవేక్షణ పని అప్పగించారు. మరికొన్ని పన్నులను సీఎస్‌సీ (సిటిజన్ సర్వీస్ సెంటర్)

మిగతా 7లో

కూరగాయల మార్కెట్ భవనానికి కాకా వెంకటస్వామి పేరు పెట్టడం సిగ్గు చేటు



మార్కెట్ భవనం ఎదుట ధర్నా చేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

బెల్లంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కూరగాయల మార్కెట్ భవనానికి గడ్డం వెంకటస్వామి(కాకా) పేరుపెట్టడం సిగ్గు చేటని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయకార్యదర్శి పసులేటి వెంకటేష్‌లు పేర్కొన్నారు. మార్కెట్ భవనానికి వెంకటస్వామి పేరును రద్దు చేయాలని సోమవారం మార్కెట్ భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం కౌన్సిల్ సమావేశంలో మార్కెట్‌కు గడ్డం వెంకటస్వామి పేరు పెట్టాలని తీర్మానం చేయడం సరైంది కాదన్నారు. అంబేద్కర్ పేరు పెట్టాలని సభ్యులు తీర్మానం చేయాల్సి ఉండగా కాంగ్రెస్ నాయకుని పేరు పెట్టడం అనాలోచిత విధానానికి నిదర్శనమన్నారు. అంబేద్కర్ పేరు పెడితే పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, నాయకులు, వ్యాపారులు హర్షిస్తారని తెలిపారు. కాకా వెంకటస్వామి బెల్లంపల్లికి చేసిందేమి లేదని, స్థానికుడు కూడా కాదని, అధికారం ఉంది కదా అని అగ్ర నాయకుల మెప్పు పొందడానికి కౌన్సిల్‌లో తీర్మానం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే మార్కెట్‌కు అంబేద్కర్ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఆరేపల్లి రమేష్, సతీష్, సాయి, శేఖర్, అరుణ్, రాకేష్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సినిమాలను తలపిస్తున్న
ఫొటోషూట్
- మారుతున్న శుభకార్యాల ధోరణి
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో లొకేషన్లు
- ఆసక్తి చూపుతున్న పలువురు
7

సాగు నీరు అందక
ఎండిపోతున్న వరి
6

మంచిర్యాల ఆర్డీవో బదిలీ

గర్మిళ్ల, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న వి.రాములు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను నిర్మల్ జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన స్థానంలో పోస్టింగ్ కోసం వేయిటింగ్‌లో ఉన్న జి.శ్రీనివాస్‌రావును నియమించారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



గుడిరేవు గుస్సాడి దర్బార్‌లో ప్రసంగిస్తున్న గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి

దండేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి గిరిజనుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌లు అన్నారు. గుడిరేవులో పద్మల్‌పూరీ కాకో ఆలయంలో సోమవారం నిర్వహించిన గుస్సాడి దర్బార్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. ముందుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గిరిజన సంప్రదాయబద్ధంగా డప్పు చప్పులతో గుస్సాడి వేషధారణతో స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ ఆదివాసి సంప్రదాయలకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుతూ వాటిని పాటించడంలో ఆదివాసీలు ప్రత్యేకంగా నిలుస్తారన్నారు. గిరిజన సంస్కృతీ, సంప్రదా యాలను కాపాడేది గిరిజనులేనన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సోము, మాజీ సర్పంచులు మంజుభార్గవి, లింగవ్వ నాయకులు తిరుపతి, మంజుల, ఆలయ కమిటీ సభ్యులు ఆదివాసి గిరిజన నాయకులు, పాల్గొన్నారు.

ప్రతి దండారీకి రూ. 15 వేలు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు పరిధిలోని ప్రతీ దండారికి రూ.15 వేల చొప్పున కేటాయించామని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి ఖుష్బూగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూరు పరిధిలోని వెయ్యి గ్రామాల్లో దండారికి రూ.15 వేల చొప్పున ప్రభుత్వం రూ. 1.50 కోట్లు దీపావళి కానుకగా కేటాయించిందన్నారు.



రైస్‌మిల్లర్లపై వేధింపులు తగదు

- ఈ సీజన్‌లో ధాన్యం దించే ప్రసక్తేలేదు
- అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు

మంచిర్యాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పేరుతో రైస్ మిల్లర్లపై అధికారుల వేధింపులు తగవని రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గుంత నాగరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎంఆర్ కింద క్వింటాల్‌కు 67 కిలోల సన్న బియ్యం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. నూకలతో కలిపి లెక్కగట్టినా 55 కిలోల కంటే దాటదని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అధికారులు తమ మెడపై కత్తి పెట్టి దించుకునేలా చేస్తున్నారని, అనంతరం సీఎంఆర్ పేరిట వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సీఎంఆర్ ఇవ్వలేదని క్రిమినల్ కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లుల్లో ధాన్యం దించుకునే సమయంలో తేమ శాతం 17లోపు ఉండాలని, రాజకీయ ఒత్తిళ్లతో 21కి పైన ఉన్నా తీసుకోక తప్పడం లేదన్నారు. తేమ అధికంగా ఉన్న ధాన్యం మురిగిపోతుందని, అప్పుడు సీఎంఆర్ ఎలా ఇచ్చేదన్నారు. మిల్లర్లు స్థిరాస్థులు అమ్ముకొని సొమ్ము చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తమ పరిస్థితులు అర్థం చేసుకోకుండా ఏకపక్షంగా ఆర్ఆర్ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారని వాపోయారు. మిల్లులు నడిపి కేసుల పాలు అయ్యే బదులు, ఈసారి ధాన్యం దించుకోవద్దనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిపారు. తమ సమ్యలపట్ల ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని, అప్పుడే ధాన్యం దించుకుంటామని స్పష్టం చేశారు. రా రైస్ మిల్లర్లు పడుతున్న కష్టాలను బాయిల్డ్ మిల్లర్లు పట్టించుకోవడం లేదని, ఈ కారణంగా తాము ప్రత్యేకంగా'రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్'ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు.

కార్యవర్గం ఏర్పాటు

సమావేశం అనంతరం జిల్లా రా రైస్ మిల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుంత నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బత్తుల శ్రీనివాస్, కోశాధికారిగా మావాడి సంతోష్, ఉపాధ్యక్షుడిగా జాడి రమేష్, సంయుక్త కార్యదర్శిగా కాలేశ్వరం సాగర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఆకుల సాయి, దర్శనాల రమేష్, ఈసీ మెంబర్‌గా గుంత సుదీప్‌లు ఎన్నికయ్యారు.

















క్రైం కార్నర్

ప్రాణహితలో గల్లంతైన మరో యువకుడి మృతదేహం లభ్యం

బెజ్జూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సోమిని సమీపంలోని ప్రాణహిత నదిలో శనివారం స్నానానికి వెళ్లి ముగ్గురు యువకులు గల్లంతు కాగా ఇద్దరు యువకుల మృతదేహాలు ఆదివారం లభించాయి. మరో యువకుడు మోహిజ్(19)మృతదేహం సోమవారం కోటపల్లి మండలం వెంచపల్లి గ్రామ సమీపంలో లభ్యమైనట్లు ఎస్సై విక్రం తెలిపారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం మహారాష్ట్ర, తెలంగాణ పోలీసుల సంయుక్తంగా గాలించారు. సోమిని సమీపంలోని ప్రాణహిత నుంచి సుమారు 50కిలోమీటర్ల దూరంలో కోటపల్లి మండలంలో మోహిజ్ మృతదేహం గుర్తించారు. అక్కడ చేపలు పట్టే మత్స్యకారులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. బెజ్జూరు, కోటపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మోహిజ్ మృతదేహంగా గుర్తించారు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

కాసిపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుబ్బగూడెం నీలగిరి తోటలో గంజాయి అమ్ముతున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. కోమటిచేనుకు చెందిన జాడి దిలీప్, జాడి మొగిలి, మంచిర్యాల శ్రీశ్రీనగర్‌కుచెందిన రాంటెంకి మధుకర్‌లు గంజాయి విక్రయిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి 90 గ్రాముల గంజాయి, స్కూటీ, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుకున్న గంజాయి విలువ రూ.2250 ఉంటుందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక డంప్ సీజ్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన 60 ట్రిప్పుల ఇసుకను సోమవారం రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా ఇసుకను నిల్వ చేశారనే సమాచారం మేరకు ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేసినట్లు వారు తెలిపారు. ఎంఆర్ఐ అబ్దుల్ అజీజ్, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

మెడికల్ కళాశాల విద్యార్థుల ఘర్షణ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాల జూనియర్, సీనియర్ విద్యార్థులు ఆదివారం రాత్రి ఘర్షణకు దిగినట్లు తెలిసింది. రాత్రి సమయంలో వాలీబాల్ ఆడుతున్న క్రమంలో విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. జూనియర్ విద్యార్థులకు సంబంధించిన కొందరు బయటి వ్యక్తులు కళాశాలలోకి ప్రవేశించి సీనియర్ విద్యార్థులపై దాడికి పాల్పడగా ఓ విద్యార్థికి గాయాలైనట్లు సమాచారం. గొడవ విషయం తేలే వరకు క్లాసులకు హాజరుకామని సీనియర్ విద్యార్థులు సోమవారం ఉదయం కళాశాల ఎదుట బైఠాయించగా ప్రిన్సిపాల్ తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయమై ప్రిన్సిపాల్ దావుద్ సులేమాన్‌ను వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. కాగా కళాశాలలోకి బయటి వ్యక్తులు చొరబడి విద్యార్థులపై దాడి చేయడం చర్చనీయాంశంగా మారింది.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలి

బెల్లంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేయాలని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ పూర్ణచందర్ అన్నారు. సోమవారం బుగ్గ ఆలయం పరిసర ప్రాంతాల్లో అటవీ శాఖ సిబ్బందితో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగించడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. భక్తులకు ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడడం వల్ల జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వస్తాయని, పశువులు ప్లాస్టిక్ తిని మృత్యువాత పడతాయని తెలిపారు. ఫంక్షన్‌లు, విందుల్లో స్టీల్ ప్లేట్లను వాడాలని సూచించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్‌నాయక్, తిరుపతి, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్‌లు యుగేందర్, రాజు, శంకర్, శ్రీధర్, గోపి, వెంకటేష్, బాస్కర్, ఆలయ ఈవో బాపురెడ్డి, పాల్గొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలి

జైపూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని డీఎల్‌పీవో ధర్మరాణి పేర్కొన్నారు. సోమవారం మిట్టపల్లి గ్రామపంచాయతీలో కార్యదర్శి ప్రవీణ్‌పై ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టారు. వార్డు సభ్యులు గ్రామ ప్రజల నుంచి కార్యదర్శిపై ఫిర్యాదులు స్వీకరించారని, నివేదికలను జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఎంపీవో శ్రీపతి బాపురావు, కార్యదర్శులు సత్యనారాయణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును బాధ్యతగా పూర్తి చేయాలి



సభ్యత్వ నమోదుపై అవగాహన కల్పిస్తున్న గంగారెడ్డి

కోటపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదును బాధ్యతగా పూర్తి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పెద్దోళ్ల గంగారెడ్డి, జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ కృష్ణమూర్తిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య అధ్యక్షతన బూత్‌స్థాయి అధ్యక్షుల సమావేశం నిర్వహించారు. ముఖ్య నాయకులు గ్రామాలను దత్తత తీసుకుని సభ్యత్వ నమోదు పూర్తి చేయాలన్నారు. బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, చెన్నూరు అసెంబ్లీ కన్వీనర్ అక్కల రమేష్, నాయకులు వంశీగౌడ్, నాగేశ్వర్‌రావు, వెంకటేష్, పెద్దింటి పున్నంచంద్, రాజేందర్, రాజేష్, శ్యాంసుందర్,పాల్గొన్నారు.

కాంగ్రెస్‌వి కుట్ర పూరిత రాజకీయాలు

బెల్లంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సెర్చ్ వారెంటు లేకుండా కేటీఆర్, ఆయన బంధువుల ఇండ్లలో సోదాలు చేస్తూ కాంగ్రెస్ కుట్రపూరిత రాజకీయాలు చేస్తుందని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ అన్నారు. సోమవారం కాంటా చౌరస్తాలో బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కేటీఆర్ ఇంటిపై దౌర్జన్యంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. అరుణ్, రోషన్, ప్రసాద్, కిరణ్, సంతోష్ పాల్గొన్నారు.

చెన్నూరు,(ఆంధ్రజ్యోతి): కేటీఆర్ ఇంట్లో ఎక్సైజ్, పోలీసుల శాఖల అధికారులు అక్రమంగా చొరడడంతో పాటు అడ్డుకునే ప్రయత్నం చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో పాటు ఇతర నేతలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. నాయకులు కృష్ణ, నయాబ్,మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ బస్టాండ్ నుంచి కొత్తరోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ, హెల్మెట్ ధరించని కారణంగా రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది చనిపోతున్నారన్నారు. సీఐ వేణుచందర్, ఎస్ఐలు సంతోష్, శ్రీధర్ పాల్గొన్నారు.

చెన్నూరు,(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలో పోలీసులు ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్‌ను బరువుగా భావించవద్దని, బాధ్యతగా ధరించాలని సూచించారు. పట్టణ సీఐ రవీందర్, ఎస్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

బహిరంగ విచారణకు వెళ్లిన బీసీ నాయకులు


జన్నారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్‌ల పెంపు అంశంపై సోమవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన బహిరంగ విచారణకు మండల నాయకులు తరలివెళ్లారు. కడార్ల నరసయ్య మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కులాల వారికి 52 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని విన్నవించామన్నారు. నర్సింహులు, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ కార్మికులందరికి కనీస వేతనాలివ్వాలని సోమవారం కార్మిక సంఘం నాయకులు మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం అందజేశారు. జీహెచ్ఎంసీలో ఇస్తున్నట్లుగా వేతనాలివ్వాలన్నారు.

సాగునీరందక ఎండిపోతున్న వరి

- చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి
- నిలిచిపోయిన లిఫ్టు ఇరిగేషన్ నీటి సరఫరా
- గింజ పాలుపోసుకునే దశలో ఉన్న వరి



ఎత్తి పోతల పథకం వద్ద ఉన్న ఖాళీ ట్రాన్స్‌ఫార్మర్

సిర్పూర్(టి),అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుడ్కిలి గ్రామపంచాయతీ పరిధిలోని పెన్‌గంగా నది ఒడ్డున ఉన్న ఎత్తి పోతలపథకం(లిఫ్టు ఇరిగేషన్)కుసంబంధించిన విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి నెలరోజులక్రితం చోరీకి గురైంది. దీంతో లిఫ్టు ఇరిగేషన్ కింద ఉన్న 1200ఎకరాలకు సాగునీరు లేకపోవడంతో వరిపంట పొట్టదశలో ఎండిపోతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. కొందరు రైతులు సమీపంలో ఉన్న బోరు, చేదబావుల నుంచి నీటిని తీసుకు వచ్చి వరికి నీరందిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖల అధికారులు స్పందించి ఎత్తిపోతల పథకం వద్ద నూతన ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయించాలని సాగునీటి సంఘం ఆయకట్టు రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు పేర్కొంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోతే ఈ యాసంగి పంటలు వేయడం కష్టమేనని పేర్కొంటున్నారు.



ఎండి పోతున్న వరిపంట

దండ్రె బాపు: రైతు, హుడ్కిలి



ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ జరిగి నెల రోజులవుతోంది. ఇప్పటి వరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ఏర్పాటు చేయలేదు. వరి పంట గింజ పాలుపోసుకునే దశలో ఉంది. ఈ సమయంలో పంటకు నీరందించడం చాలా అవసరం. కానీ ట్రాన్స్‌ఫార్మర్ లేక పంట దక్కించుకోవడానికి నానా తంటాలు పడుతున్నాం.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై విచారణ జరుపుతున్నాం..: రమేష్, కౌటాల సీఐ

మండలంలోని హుడ్కిలి ఎత్తిపోతల పథకం వద్ద చోరీకి గురైన గురైన ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలపై విచారణ జరుపుతున్నాం. నింది తులను త్వరగా పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం.

విద్యార్థుల వైకల్యాన్ని గుర్తించాలి

కెరమెరి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో వైకల్యాన్ని గుర్తించాలని ఎంఈవో ప్రకాష్ అన్నారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ విద్యార్థులలో 21 రకాల వైకల్యాలో వారిని గుర్తించాలని అన్నారు. అందుకు గాను ఒక ప్రత్యేకమైన యాప్‌ను వినియోగించాలన్నారు. జిల్లా అధికారుల సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రవీందర్, సీహెచ్ భరత్‌కుమార్, గంగారాం పాల్గొన్నారు.

పలువురికి అస్వస్థత

కాగజ్‌నగర్, అక్టోబరు 28: కాగజ్‌నగర్ పెట్రోలు పంపు ఏరియాలో ఓ రెస్టారెంట్‌లో భోజనం చేసిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. స్థానిక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. అయితే ఎలాంటి ఇబ్బంది లేదని వైద్యులు తెలిపారు.

ఎస్పీఎం సమస్యను పరిష్కరించాలని కార్మికుల ర్యాలీ

కాగజ్‌నగర్, అక్టోబరు 28: ఎస్పీఎం సమస్యను పరిష్కరించాలని సోమవారం సాయంత్రం కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ఎస్పీఎం గేటు నుంచి మొదలుకొని సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్పీఎం మిల్లులో ఉత్పత్తి అయిన కాగితం టన్నుల కొద్ది పేరుకుపోతోందన్నారు. లారీ అసోసియేషన్ సమస్యతో ఉత్పత్తి బయటికి వెళ్లటం లేదన్నారు. తమ సమస్యను పరిష్కరించి తమ జీవితాలు అంధకారం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు, స్టాఫ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ అటవీ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత

- అడవి పందిని చంపారని రైతులను చితకబాదిన అధికారులు
- అటవీశాఖ అధికారులను సస్పెండు చేయాలని గ్రామస్థుల డిమాండు



పరిస్థితిని వాకబు చేస్తున్న డీఎస్పీ రామానుజం



అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు,నాయకులు

కాగజ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి):కాగజ్‌నగర్ అటవీ శాఖ కార్యాలయం ఎదుట సోమవారం రాత్రి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సిర్పూరు(టి) మండలం లక్ష్మీపూర్ అటవీప్రాంతంలో అడవిపందిని చంపారని పేర్కొంటూ అటవీశాఖ అధికారులు.. గౌతం సర్కార్, అశోక్ ఠాకూర్, దీపక్‌ఠాకూర్, ప్రణబ్‌మండల్, శంకర్ బేపారి, అరవింద్ గరామి, కమ్మరిపోచం అనే రైతులను అదుపులోకి తీసుకుని దారుణంగా కొట్టి కాగజ్‌నగర్ అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఆయాగ్రామాలకు చెందిన రైతులు, బీజేపీ నాయకులు అటవీశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. నేరాన్ని ఒప్పుకున్న తర్వాత కూడా కళ్లకు గంతలు కట్టి కొట్టాల్సిన పని ఏమిటనీ..? చనిపోతే ఎవరు బాధ్యులంటూ? గ్రామస్థులు అధికారులపై మండిపడ్డారు. రైతులను గదిలో బంధించి తాళం వేయటంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ రామానుజం, సీఐ రాజేంద్రప్రసాద్, ఎస్సైలు సుధాకర్, దీకొండ రమేష్ అటవీశాఖ కార్యాలయానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈసందర్భంగా బీజేపీ నాయకుడు పాల్వాయిసుధాకర్‌రావు మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు ఇక్బాల్, సద్దాం, ఇర్ఫాన్ ఆదివారం ఉదయంనుంచి రైతులను అదుపులోకి తీసుకొని కొట్టారని పేర్కొన్నారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, జిల్లాకార్యదర్శి దోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్,శివగౌడ్,నాయకులు,రైతులు పాల్గొన్నారు.

టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్‌గా గుళ్లపల్లి ఆనంద్



గుళ్లపల్లి ఆనంద్

కాగజ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్‌గా గుళ్లపల్లి ఆనంద్‌ను ఎంపిక చేస్తూ సోమవారం తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయపార్టీ ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు ప్రకటించారు. తనకు కీలక పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు గుళ్లపల్లి ఆనంద్ తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆసిఫాబాద్ డిపో మేనేజర్ విశ్వనాథ్ అన్నారు. ఈనెల 27 నుంచి హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలలో హోమ్‌డెలివరీ సర్వీసు ప్రారం భించామని, ఈ సర్వీసును జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. త్వరలోనే తెలంగాణలోని అన్ని పట్టణాల్లో కూడా హోండెలివరీ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9154298534 నంబరును సంప్రదించాలన్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోండి

బెజ్జూరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ జితేందర్ అన్నారు. సోమవారం మండలంలోని అంబగట్టు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గోపాల మిత్ర నేతాజీ, తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సీఈవోగా నారాయణ

దహెగాం, అక్టోబరు 28: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం సీఈవోగా టి నారాయణ సోమవారం బాధ్యతలు నిర్వహించారు. గతంలో ఇక్కడ పనిచేసిన బక్కయ్య సస్పెండ్ కావడంతో పాలకవర్గం అత్యవసర సమావేశాన్ని చైర్మన్ తిరుపతిగౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసి పీఏసీఎస్‌లో సీనియర్ ఉద్యోగి అయిన నారాయణకు సీఈవోగా బాధ్యతలు అప్పగించారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

పెంచికలపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశ నుంచి పుస్తకపఠనాన్ని అలవర్చుకోవాలని జిల్లా పరీక్షల విభాగం అధికారి ఉదయబాబు అన్నారు. సోమవారం మండలంలోని కొండపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రూంటురీడ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకపఠనం వల్ల ఆలోచన, ఊహాశక్తి, కొత్తపదాలు తెలుసుకోవచ్చన్నారు. మండలవిద్యాధికారి రమేష్‌బాబు, ప్రధానోపాధ్యా యులు అశోక్‌కుమార్, రూంటురీడ్ మండల కోఆర్డినేటర్స్ వెంకన్న, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.



అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలి: జీఎం

శ్రీరాంపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా సోమవారం జీఎం కార్యాలయంలో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెల 28వ తేదీనుంచి వచ్చేనెల 3వతేదీవరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, అధికారులసంఘం ఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం(ఫైనాన్స్) మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మౌలిక సదుపాయాల కల్పన..

ఉద్యోగులకు అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. సింగరేణి పాలిటెక్నిక్‌లో నూతన స్టడీహాల్, గార్డెన్, ఆర్వోప్లాంటును సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సింగరేణి పాలిటెక్నిక్‌లో కళాశాలలో చదువుతున్న విద్యార్థులు, సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు.

మహిళా ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ

మందమర్రి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న మహిళా బదిలీవర్కర్లు, జనరల్‌మజ్దూర్‌లకు ఉపరితల ఉద్యోగాలకు సంబంధించి ప్రత్యేకశిక్షణ ఇస్తామని ఇన్ చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ తెలిపారు. సోమవారం ఏరియాలోని కేకే5గనిపై, ఎంవీటీసీలో మహిళా ఉద్యోగులకు వృత్తిశిక్షణకు సంబంధించి కౌన్సెలింగ్ సందర్భంగా వారు మాట్లాడారు. సర్ఫేస్‌లో16డిసిగ్నేషన్‌లు ఉన్నాయని, వాటికి మహిళాఉద్యోగులు కావాలని, రాతపూర్వకంగా రాసి ఇస్తే శిక్షణ ఇస్తామన్నారు. ఇదివారికి ఉపయోగంగా ఉండడంతో పాటు భవిష్యత్‌లో పెద్దఎత్తున వేతనాలు లభిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని మహిళా ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీసభ్యులు ఐఈడీ డీజీఎం రాజన్న, ఎం జయవాణితో పాటు కేకే5గనిమేనేజర్ ప్రవీణ్,సంక్షేమాధికారి కార్తిక్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ శంకర్, ట్రైనర్ అశోక్ పాల్గొన్నారు.

'పదోన్నతులు కల్పించండి'

శ్రీరాంపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జేఎంఈటీలుగా సంస్థలో చేరి మైనింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్న తమకు ఓవర్‌మెన్లుగా పదోన్నతులు కల్పించాలని మైనింగ్‌స్టాఫ్‌సిబ్బంది ఎస్ఆర్పీ1 మేనేజర్ విజయ్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. తాము గతంలో పలుమార్లు యాజమాన్యానికి విన్నవించామని, అయినా పదోన్నతులు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సమర్పించిన వినతిపత్రాన్ని యాజమాన్యానికి పంపాలని కోరారు.

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి: సీఎండీ



ఐకే ఓసీపీ అధికారులతో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

జైపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కార్మికులు, అధికారులు రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సీఎండీ ఎన్ బలరాం అన్నారు. సోమవారం డైరెక్టర్ ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి ఇందారం ఓపెన్‌కాస్టును పరిశీలించారు. ఓసీపీలో తీసుకుంటున్న రక్షణచర్యలు, రాత్రివేళ విద్యుత్‌దీపాల అంశాలపై గని అధికారులతో సమీక్షించారు. ఓసీపీ ఓబీ కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు రోజువారీ లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని సూచించారు. ఓబీ ఎంత ఎక్కువ తీస్తే అంత బొగ్గుఉత్పత్తి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, మార్కెటింగ్ జనరల్‌మేనేజర్ రవిప్రసాద్, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, ఓసీపీ ప్రాజెక్టు అధికారి, గని అదికారులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రి సమస్యలను పరిష్కరించాలి..

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించాలని ఆసుపత్రి పరిరక్షణకమిటీ నాయకులు శ్రీరాంపూర్ బంగ్లాఏరియాకు వచ్చిన సీఎండీ బలరాంకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్లను నియమించి ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకువస్తామని చెప్పినా ఇంతవరకు జరగలేదన్నారు. వెంటనే ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని, ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మణిరాంసింగ్, రాజన్న, పోచమల్లు, మహేందర్‌గౌడ్, శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలి

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్ రావు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సీఎండీ ఎన్ బలరాం ఆధ్వర్యంలో సమీక్షసమావేశం నిర్వహించగా, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. జీవో 59 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే కోటి రూపాయల కాంట్రాక్ట్ పనులను 5కోట్ల రూపాయలకు పెంచాలని, ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంను ఆరు నెలలుగా నిలిపివేశారని, వాటిని వెంటనే ప్రారంభించి, అందరికీ అవకాశం కల్పించాలన్నారు. ఇప్పటివరకు డైరెక్టర్, జీఎం పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ అధికారులకు అన్యాయం జరిగిందని, వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిషన్ సభ్యులు రేణిగుంట ప్రవీణ్, కొంకటి లక్ష్మీనారాయణ, రాంబాబు నాయక్, జిల్లి లక్ష్మీనారాయణ, కూసారం నీలదేవ్, అసోసియేషన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అంటువ్యాధిలాంటిది: ఇన్‌చార్జి జీఎం

మందమర్రి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అవినీతి అనేది అంటువ్యాధి లాంటిదని, లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమేనని మందమర్రి ఏరియా ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారంజీఎం కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాలసందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఉద్యోగులు వారి సమస్యలసాధన, హక్కుల కోసం పోరాడాలే తప్ప అడ్డదారిలో డబ్బులుపెట్టి సాధించాలనుకోవడం చాలా తప్పనిఅన్నారు. అనంతరం అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రెటరీ సలేంద్ర సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ శ్యాసుందర్, ఐఈడీ డీజీఎం రాజన్న, డీవైపీఎం, తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

శ్రీరాంపూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి అళవందార్ వేణుమాధవ్ పేర్కొన్నారు. తెలంగాణ ఆల్‌స్టేట్ సీనియర్‌సిటిజన్ అసోసియేషన్ (టాస్కా) సమావేశం సోమవారం హైదరా బాద్‌లో జరిగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఘట్‌కేసర్ మండల అధ్యక్షుడు తోటరంగయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై పలు తీర్మాణాలు చేశారు. సమావేశంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు టి శ్రీనివాస్, సంయుక్తకార్యదర్శులు కొట్టెమల్లయ్య, లక్ష్మీనారాయణ, రాజనర్సు ప్రభాకర్, ప్రతాప్‌సింగ్, సలహాదారులు, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం

మందమర్రి టౌన్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో శరీర దారుఢ్యంతోపాటు మంచి ఆరోగ్యం లభిస్తుందని కేకే1డిస్పెన్సరీ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. సోమవారం సింగరేణి పాఠశాలలో మందమర్రి, బెల్లంపల్లి నియర్‌బై ఏరియా ఫుట్‌బాల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ క్రీడాకారులకు అన్నివిధాల ప్రోత్సాహం అందిస్తుందన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో అశోక్, కంది శ్రీనివాస్, బానయ్య, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ, కెప్టెన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన నియర్ బై ఏరియా పోటీల్లో మందమర్రి గ్రూపు క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచారు.

న్యూస్ బాక్స్

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలి

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరు కావాలని డీఈవో ఎస్.యాదయ్య తెలిపారు. డీఈవో కార్యాలయంలో మంగళ, బుధవారాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 1:3 నిష్పత్తి ప్రకారంగా వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు జతల జిరాక్స్ కాపీలు, గెజిట్ అధికారిచే అటెస్ట్ చేసిన కాపీలు, 3 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలని సూచించారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

మందమర్రిటౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్‌ల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఉట్కూరి నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం శ్రీకన్వెన్షన్ హాలులో నూతన విద్యావిధానం పట్టభద్రుల ముఖాముఖిలో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు విద్యుత్ బిల్లులు లేకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నారన్నారు. సదస్సుకు ట్రస్మా రాష్ట్ర నాయకులు అబ్దుల్ అజీజ్ అధ్యక్షత వహించారు. బెల్లంపల్లి, మందమర్రి ట్రస్మా నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్‌పై శిక్షణ

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు మంగళవారం స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్-2024పై జూమ్ మీటింగ్ ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈవో ఎస్.యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 12వ తరగతుల ఉపాధ్యాయులు పాల్గొనాలని తెలిపారు. మారథాన్‌లో ఎక్కువసంఖ్యలో విద్యార్థులు పాల్గొనేందుకు కృషి చేయాలని సూచించారు.

పత్తి పంటలో నాణ్యత ప్రమాణాలపై అవగాహన

చెన్నూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండలం, కత్తెరసాల గ్రామాల్లో జిల్లా వ్యవసాయాధికారి కల్పన సోమవారం పత్తి పంటలో నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతీ రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో మట్టి నమూనాలను సేకరించి ఎరువుల మోతాదును తెలియజేస్తామన్నారు. రైతులు పీఎం కిసాన్ కేవైసీ చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్త రాజమణి, ఏడీఏ బానోత్ ప్రసాద్, ఏవో మార్క్ గ్లాడ్‌స్టన్, ఏఈవోలు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు


మందమర్రిరూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి రైతువేదికలో రైతులకు న్యాయ సలహాలు అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికారి అర్పిత ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు ఉంటుందని ఏఈవో ముత్యం తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ పథకాలపై సలహాలు అందజేస్తారని, రైతులందరు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మోడల్ లైబ్రరీ ప్రారంభం

భీమారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భీమారంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో రూమ్‌టూ రీడ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని సోమవారం ఎంఈవో సురేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మోడల్ లైబ్రరీలో రంగు రంగుల కథలతో కూడిన పుస్తకాలు, విషయ పరిజ్ఞానం కలిగిన పుస్తకాలు ఉన్నట్లు తెలిపారు. పఠన సామాగ్రి ద్వారా విద్యార్థుల్లో విద్య సామర్థ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విక్రమ్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు కైలాసం, ఉపాధ్యాయులు రూమ్ టూ రీడ్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

సినిమాలను తలపిస్తున్న ఫొటోషూట్

ఫొటోషూట్ న్యూట్రెండ్... ఏ ఫంక్షన్ అయిన ఫొటోషూట్‌కు ప్రాధానమిస్తున్నారు. గతంలో ఫంక్షన్‌లో మాత్రమే ఫొటోలు దిగేవారు. ప్రస్తుతం ఫంక్షన్‌కు ముందు ఫొటోషూట్‌కు వెళుతున్నారు. బర్త్‌డే, మ్యారేజ్ ఇలా పలు ఫంక్షన్లకు దిగుతున్నారు. ఫొటోషూట్ క్రేజ్ పెరగడంతో పలు ప్రాంతాల్లో ప్రత్యేక స్టూడియోలు వెలిసాయి. అంతేకాకుండా నేచురల్‌గా ఉండేందుకు వాటర్‌ఫాల్స్, పచ్చని పంట పొలాలు, ఆలయాలకు వెళుతున్నారు. మరికొందరు బీచ్ షూట్‌కు ఇతర రాష్ట్రాలకు వెళుతున్నారు. ఫొటోషూట్‌కు లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు.



- మారుతున్న శుభకార్యాల ధోరణి
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో లొకేషన్లు
- ఆసక్తి చూపుతున్న పలువురు

బెల్లంపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సినిమా పాటలను తలపించే ఫొటోషూట్ తీస్తున్నారు. ఒకప్పుడు వివాహాలు ఇతర వేడుకలు ఏమైనా అయితే ఫొటోలు, వీడియోలు తీయించుకునే వారు. ప్రస్తుతం ట్రెండ్ మారింది. శుభకార్యాలకు ముందు ఫొటోషూట్ పేరుతో ఫొటోలు, వీడియోలు తీయించు కుంటున్నారు. పెళ్లిళ్లు, బర్త్‌డేలు, శారీ ఫంక్షన్‌లు, బారసాల ఇలా ప్రతీ శుభకార్యానికి ఫొటోషూట్ తప్పనిసరి అయ్యింది. జిల్లాలో అందమైన లొకేషన్‌లు ఉండడంతో ఫొటోషూట్ తీసుకుంటుండగా మరికొందరు ఇతర ప్రాంతాలకు సైతం వెళ్తున్నారు.

సినిమాలను తలపిస్తున్న ఫొటోషూట్

వివాహాల్లో హల్దీ, మెహందీ, సంగీత్, ప్రీ వెడ్డింగ్ కోసం ఫొటోషూట్‌లు తీయించుకుంటున్నారు. ఇందుకోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. వివాహనికి ముందు ఫొటోషూట్ తీయించుకుని వీడియోను వాట్సాప్‌ద్వారా బంధువులకు, స్నేహితులకు పంపుతూ ఆహ్వానిస్తున్నారు. ఇతర శుభాకార్యాలకు సైతం ఇదే ట్రెండ్ నడుస్తోంది. నిశ్చితార్థం తర్వాత సినిమా పాటలను తలపించేలా మ్యారేజ్ ఫొటోషూట్ చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక వీడియో కెమెరాలు, డ్రోన్ లు, లైటింగ్ గాడ్జెస్, ఆధునిక లెన్స్ ఉన్న కెమెరాలను ఫొటోగ్రాఫర్లు వినియోగిస్తున్నారు. ఫొటోషూట్ తీయడానికి కనీసం ఐదు నుంచి ఏడుగురు బృం దంగా ఏర్పడి నాలుగైదు కెమెరాలతో రూపొందిస్తున్నారు.

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో

ఏసీసీ క్వారీ, గుల్లకోట దేవాలయ పరిసర ప్రాంతాల్లో, సీసీసీలోని నందనవనం పార్కు, జన్నారంలోని అటవీ ప్రాంతం, గాంధారి ఖిల్లా, చెన్నూరులోని పార్కుతో పాటు గోదావరి పరిసర ప్రాంతాల్లో ఫొటోషూట్ చేస్తున్నారు. దండేపల్లిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టూడియోకు వెళ్తున్నారు. స్టూడియో షూట్‌కు రూ. 8వేల నుంచి 16 వేల వరకు తీసుకుంటున్నారు. వైజాగ్, హైద్రాబాద్, మారేడుపల్లి, కేరళ, అరకు వంటి ప్రాంతాలకు వెళ్లి షూట్ తీసుకుంటున్నారు. కొందరు ఫొటోగ్రాఫర్లు శిక్షణ తీసుకుని వీడియోలు, ఫొటోలు షూట్ చేస్తున్నారు. వధూవరుల హావభావాలు, నేపథ్య గీతాలు, అందమైన లొకేషన్‌లలో తీస్తూ షూట్‌కు రూ. 50 వేల నుంచి 2 లక్షల వరకు తీసుకుంటున్నారు.

శుభకార్యాలయాకు తప్పనసరి అయ్యింది

రఫి, ఫోటోస్టూడియో నిర్వహకుడు, తాండూర్



శుభకార్యాలకు ప్రస్తుతం ఫొటోషూట్ తప్పనిసరి అయ్యింది. శుభ కార్యాలకు సంబంధించిన క్షణాలను పది కాలాల పాటు దాచుకునేలా షూటింగ్, ఎడిటింగ్‌తో పాటు ఆల్బమ్ మేకింగ్ చేస్తున్నాం. 90 శాతం జంటలు పెళ్లితో పాటు ప్రీ వెడ్డింగ్, పోస్టువెడ్డింగ్ షూట్‌లను కోరుకుంటున్నారు. వారి ఆసక్తికి తగినట్లే అందమైన లొకేషన్‌లలో ఫొటోలు, వీడియోలు తీసి ముందే అందిస్తున్నాం. ఫొటోషూట్‌ల ద్వారా మంచి ఆదాయం వస్తుంది.



తిర్యాణిలోని పంగిడిమాదర వాటర్‌ఫాల్ వద్ద ఫొటోషూట్



ఏసీసీ క్వారీ వద్ద..



సీసీసీ పార్కులో బర్త్‌డే వేడుకలు..



అల్ఫోర్స్‌లో ముందస్తు దీపావళి వేడుకలు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న చిన్నారులు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బైపాస్ రోడ్డులో గల అల్ఫోర్స్ పాఠశాలలో సోమవారం ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజమణి మాట్లాడుతూ విద్యార్థులకు దీపావళి పండుగ విశిష్టతను, ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత



రహదారిపై స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటును పరిశీలిస్తున్న సీఐ

మందమర్రి టౌన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రైల్వే బ్రిడ్జితోపాటు ఫ్లై ఓవర్‌లలో స్పీడ్ బ్రేకర్లు వేసే విషయం పరిశీలిస్తున్నామని తెలిపారు. ప్రతీ వాహనదా రుడు రోడ్డు భద్రత గురించి తెలుసుకోవాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమా దాలకు దారి తీస్తుందన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని కోరారు. ఎస్సై రాజశేఖర్, నేషనల్ హైవే అధికారులు సునీల్, మహేష్ పాల్గొన్నారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాలి

బాణాసంచా విక్రయిస్తున్న దుకాణదారులు నిబంధనలు పాటించాలని సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దుకాణాలకు లైసెన్స్ ఉండాలని, జనావాసాల్లో దుకాణాలను ఏర్పాటు చేయవద్దన్నారు. నిబంధనలు పాటించని దుకాణాలను సీజ్ చేస్తామన్నారు. ఫైర్ సేఫ్టీ పాటించాలని సూచించారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి కృషి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి, బెల్లంపల్లి, హాజీపూర్, జైపూర్, దొనబండ, పెర్కపల్లి, దండేపల్లి, చిర్రకుంట కన్నెపల్లిప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందించారు. ఆర్డీవోలు రాములు, హరికృష్ణ, డీఆర్‌డీవో కిషన్ పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

కన్నెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ డీఏల చెల్లింపు, పీఆర్‌సీ అమలు తదితర సమస్యలపై తహసీల్దార్‌కు తపస్ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేష్ మాట్లాడుతూ ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే కేవలం ఒక డీఏను మాత్రమే విడుదల చేయడం అన్యాయమన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నవంబర్ 23న ఇందిరాపార్కు వద్ద ధర్మ గ్రహ దీక్ష చేపడుతామన్నారు.

చెన్నూరు, (ఆంధ్రజ్యోతి): పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ అమలు వంటి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ మల్లికార్జున్‌కు తపస్ సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం 1 డీఏ మాత్రమే ప్రకటించడం సరైంది కాదన్నారు. నాయకులు నాగరాజు, శ్రీకాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు, బిల్లులు, పీఆర్‌సీ విడుదల చేయాలని తపస్ నాయకులు తహసీల్దార్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.

రశీదు పుస్తకాలు మాయం

5వ పేజీ తరువాయి..

ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆపరేటర్లు వసూలు చేస్తున్నారు. ఇందులోనూ కొందరు ఉద్యోగులు రూ.3.85 లక్షలు స్వాహా చేయగా, అధికారులు తిరిగి వసూలు చేయగలిగారు.

బయటకు పొక్కకుండా జాగ్రత్తలు

బిల్లుల వసూళ్లలో వెలుగు చూస్తున్న అక్రమాలు బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. సంబంధిత ఉద్యోగి నుంచి తిరిగి రాబడు తుండగా, కొన్ని సందర్భాల్లో వారు కట్టలేని పరిస్థితుల్లో జటిలం అవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ అధికారులు సంబంధిత శాఖల ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. అధికారులు రహస్యంగా ఉంచాలనుకున్నా గతంలో రశీదు పుస్తకాల మాయం విషయం బయటకు పొక్కడంతో కలెక్టర్‌తోపాటు వరంగల్‌లోని మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్ దృష్టికి వెళ్లింది. దీంతో అప్రమత్తమైన అధికారులు తలా కొంత వసూలు చేసి చెల్లించారు. ఇలా ఉద్యోగులు సొమ్ము మాయం చేసినప్పుడల్లా సర్దుబాటు చేస్తూ అధికారులు సమస్యల నుంచి బయటపడుతున్నారు. ఐదేళ్లలో దాదాపు ఐదు సంఘటనలు జరిగి పెద్ద మొత్తంలో సొమ్ము పక్కదారి పట్టింది. తరుచుగా జరుగుతున్న ఈ విషయమై కలెక్టర్‌తోపాటు హైద్రాబాద్‌లోని మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు దృష్టి సారిస్తే అవినీతి వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.


భయపెడుతున్న బ్రెయిన్ స్ట్రోక్

వయస్సుతో సంబంధం లేకుండా పెరుగుతున్న వ్యాధిగ్రస్తులు

నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ డే

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉరుకులు, పరుగుల జీవన విధానం, ఆహారపు అలవాట్ల వల్ల వస్తున్న వ్యాధుల్లో బ్రెయిన్ స్ట్రోక్ ఒకటి. వృద్ధాప్యంలో వచ్చే ఈ వ్యాధి ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా అందరికీ రావడం ఆందోళన కల్గిస్తోంది. అక్టోబర్ 29, 2004న కెనడాలో వరల్డ్ స్ట్రోక్ డే స్థాపించబడింది. 2006లో వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ స్థాపించబడింది. అప్పటి నుంచి వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. ఈ యేడు గ్రేటర్ థాన్ స్ట్రోక్ యాక్టివ్ ఛాలెంజ్ థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ అంటే



మెదడులోని నాడీ వ్యవస్థలో రక్త ప్రసరణకు అవరోధం కల్గడం, నరాలు చిట్లిపోవడం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ సంభవిస్తుంది. ధూమపానం, అతిగా మద్యం సేవించడం, శారీరకంగా శ్రమ లేకపోవడం, హైపర్ టెన్షన్, జన్యుపరమైన లోపాలు, బీపీ, షుగర్ అదుపులో లేకపోవడం వల్ల స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఉంటాయి.

వ్యాధి లక్షణాలు: చేతులు, కాళ్ళు, ముఖం భాగంలో తిమ్మిర్లతో పాటు బలహీనంగా మారుతాయి. మాట్లాడటంలో ఇబ్బంది కల్గుతుంది. కంటి చూపు సరిగ్గా పనిచేయదు. ముఖం ఒక పక్కకు ఒరిగినట్లువుతుంది. మూతి వంకర పోతుంది. మాట్లాడలేని స్థితికి చేరుకుంటారు. కాళ్ళు, చేతులు పనిచేయవు.

ఎలా గుర్తించాలి..: స్ట్రోక్ సంభవించిన వెంటనే సంబంధిత నరాల వైద్యుడి దగ్గరకు తీసుకువెళ్తే ఆయన పరీక్షించి సీటీ స్కాన్, ఎంఆర్ఐ లాంటి పరీక్షలను చేస్తారు. పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణతో పాటు తీవ్రత తెలుస్తుంది. స్ట్రోక్‌కు గురైన వారికి 4 గంటల లోపు వైద్యం అందించాల్సి వుంటుంది. సరైన సమయంలో వైద్యం అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను అదుపులోకి తీసుకువచ్చేందుకు వీలు కల్గుతుంది.

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి పట్టణంలో ఈ నెల 26న జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి అండర్-14 కరాటే పోటీల్లో మంచిర్యాల మోడల్ స్కూల్ విద్యార్థిని వి.జ్యోష్మిత రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ బుచ్చన్న, పీడీ సుదీప్ తెలిపారు. నవంబర్ 2 నుంచి 4వరకు సంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఫణిరాజా, పీఈటీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సిరంగి గోపాల్, గాజుల శ్రీనివాస్‌లు విద్యార్థిని అభినందించారు.

రామకృష్ణాపూర్,(ఆంధ్రజ్యోతి): విక్టరీ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 27న కాజీపేటలో నిర్వహించిన స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో రామకృష్ణాపూర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్ 9 స్పారింగ్ విభాగంలో తస్విక, అండర్ 17లో మాధురి ప్రథమ, శ్రీహర్షిత ద్వితీయ స్థానాన్ని సాధించినట్లు కరాటే మాస్టర్ జుల శ్రీనివాస్ తెలిపారు. కటాస్ వివిధ గ్రూపుల నుంచి విష్ణుప్రియ ప్రథమ, శ్రీవైష్ణవి ద్వితీయ, అనన్య తృతీయ, సామ్యవేద, అశ్వితలు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. గ్రాండ్ మాస్టర్ మల్లిఖార్జున అభినందించారు.

జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

కన్నెపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కన్నెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని మల్లిక అండర్ 17న బాలికల జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రమేష్ తెలిపారు. అచ్చలాపూర్‌లో జరిగిన జిల్లాస్థాయి అండర్ 17 బాలికల కబడ్డీ ఎంపిక పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. విద్యార్థిని సోమవారం ప్రధానోపాధ్యాయుడు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయురాలు వహీదాబేగం, ఉపాధ్యాయులు అభినందించారు.

పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు

భీమారం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : పత్తి కొనుగోలుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందని మండల వ్యవసాయాధికారి సుధాకర్ సోమవారం తెలిపారు. కనీస మద్దతు ధర రూ.7521 ప్రకటించిందన్నారు. రైతులు పత్తి తేమ8 శాతం నుంచి 12 శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్‌తోపాటు ఆధార్ లింక్ ఉన్న మొబైల్‌ను ఓటీపీ కోసం తీసుకురావాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ రైతుల సౌకర్యార్థం వాట్సాప్ నెంబర్ 8897281111 ప్రారంభించిందని తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

వేమనపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లెడ గ్రామంలో సోమవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యులు సుప్రియ, పవన్‌కుమార్‌లు తెలిపారు. వారు మాట్లాడుతూ 350 గేదెలు, 200 ఆవులు, ఎద్దులకు టీకాలను వేశామన్నారు. సిబ్బంది ఫెరోజ్, అస్లాంపాషా, గోపాలమిత్ర శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధన త్రయోదశికి సిద్ధం

- నేడు, రేపు పూజలు - బంగారం కొనుగోళ్ళు, లక్ష్మీపూజలు

నస్పూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ధన త్రయోదశి రోజున లక్ష్మీదేవిని పూజించడం వలన సంపద, శ్రేయస్సు కలుగతాయని విశ్వాసం. దీపావళి వేడుకల ప్రారంభ రోజు ధన్ తేరాస్ (ధనత్రయోదశి) మంగళ, బుధవారాల్లో జరుపుకోనున్నారు. బంగారం, వెండి కొనుగోలు చేయడంతో పాటు పాత నగదు బిళ్ళలకు కొత్త నగదును కల్పి అమావాస్య వరకు అభిషేకాలు చేస్తారు. త్రయోదశి నుంచి 3 రోజుల వరకు లక్ష్మీదేవికి, కుబేరునికి అభిషేక పూజలు జరుపుతారు. వస్త్ర, వ్యాపార, వాణిజ్య నిలయాలను, కార్యాలయాలను శుద్ధి చేసి రంగులు వేస్తారు. మామిడి తోర ణాలు, పసుపు, కుంకుమలు, పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తారు. పూజా మందిరాలను, దేవుని పటాలకు అలంకారాలు చేస్తారు. ధన త్రయోదశి సందర్భంగా వ్యాపారులు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించారు.



అంబరాన్నంటిన దండారి సంబరాలు



గుడిరేవు కాకో గుస్సాడి దర్బార్‌కు హాజరైన గిరిజనులు

దండేపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి గిరిజన ఆరాధ్య దైవమైన పద్మల్‌పురి కాకో ఏత్మల్‌సార్ పేన్ అమ్మవారి ఆలయంలో సోమవారం జరిగిన దండారీ, గిరిజన దర్బార్‌కు రాష్ట్ర నలుమూల నుంచి గిరిజనులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి పద్మల్‌పురి కాకో ఏత్మల్‌సార్ పేన్ అమ్మవారిని దర్శించుకున్నారు. గిరిజన సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. యేడాది ఒకసారి జరిగే దండారీ ఉత్సవాల్లో భాగంగా ఆలయం వద్ద గిరిజన సంప్రదాయబద్దంగా గుస్సాడీ నృత్యాలు, రేలరేల ఆటాపాటలతో నృత్యాలు చేస్తూ దండారీ సంబరాలను జరుపుకున్నారు. నియమ నిష్ఠలతో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త కోడళ్ళ బేటింగ్ నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద రకరకాల పిండి పదార్థాలు తయారు చేసి కోళ్లలను, మేకలను బలి ఇచ్చారు.

కాకో దర్శించుకున్న కార్పొరేషన్ చైర్మన్, డీసీపీ

పద్మల్‌పూరీ కాకో ఆలయంలో జరిగిన దండారీ గుస్సాడి దర్బార్‌కు రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, మంచిర్యాల డీసీపీ భాస్కర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌లు హాజరై కాకో అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి గిరిజన సంప్రదాబద్ధంగా డోలు వాయిద్యాలు, గుస్సాడి నృత్యాలతో ఆలయ కమిటీ నిర్వాహకులు, గిరిజనులు ఘన స్వాగతం పలికారు. డీసీపీ, కాకో అమ్మవారికి చీరసారెలను సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, ఆదివాసి సంఘం నాయకులు ఉమ్మడి జిల్లాలో వివిధ గ్రామాల పటేల్, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



గుస్సాడి పులి వేషధారణతో గిరిజనుడు










పిండి వంటలు చేస్తున్న గిరిజన మహిళలు, ప్రత్యేక పూజలు చేస్తున్న గిరిజన కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి, గుస్సాడి వేషధారణతో డీసీపీ ఎగ్గిడి భాస్కర్, డోలు వాయిద్యాలు, గుస్సాడి వేషధారణలతో గిరిజనులు



అదనపు కలెక్టర్ దాసరి వేణు బదిలీ

ఆసిఫాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ విభాగం)గా విధులు నిర్వహిస్తున్న దాసరి వేణు పెద్దపల్లి అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. పెద్దపల్లి అదనపు కలెక్టర్(రెవెన్యూ విభాగం)గా పనిచేస్తున్న జీవీ శ్యాంప్రసాద్‌లాల్ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా రానున్నారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులు జారీచేసింది.

మార్పు కోసమే రాజకీయాల్లోకి వచ్చా

● పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి



కళాశాలల ప్రతినిధులతో నరేందర్‌రెడ్డి

కాగజ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉపయోగపడే చట్టాలు రూపొందించడంలో కీలకపాత్ర పోషించే శాసనమండలికి పోటీచేస్తున్నాని, రాజకీయాల్లోకి మార్పు కోసమే వస్తున్నానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలో ఆయన పలు సమావేశాల్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన విజయానికి అంతా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా తొలిసారిగా వచ్చిన సందర్భంగా ఆయా పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు.

రాష్ట్రస్థాయి పోటీలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2, 3, 4తేదీల్లో జిల్లాకేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలను విజయవంతం చేయాలని హ్యాండ్‌బాల్ ఉమ్మడిజిల్లా ప్రధానకార్యదర్శి రమేష్ కోరారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ పోటీలలో ఉమ్మడి పదిజిల్లాలోని 180మంది క్రీడాకారులు పాల్గొంటారని, ఈ పోటీలు వ్యాయామ ఉపాధ్యాయుడు కీ.శే.సదానందంను స్మరించుకుంటూ ఆయనకు అంకితం చేస్తామన్నారు. సమావేశంలో అసోసియేషన్‌సభ్యులు రమేష్‌రెడ్డి, మీనారెడ్డి, జంగు, కోచ్‌లు అరవింద్, రాజలింగు, సాయి, రాకేష్, పీఈటీలు అరవింద్, పాండురంగ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడాపాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి అండర్-14, 17బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపికపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు జీసీడీవో శకుంతల ముఖ్యఅతిథిగా హాజరై జెండాఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 200మంది విద్యార్థులు పాల్గొన్నట్లు క్రీడలఅధికారి మీనారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జంగు, వార్డెన్ సాయి బాబా, శిక్షకులు విద్యాసాగర్, పీడీ శారద, హరీష్, పీఈటీలు బాలాజీ, రవి, యాదగిరి, స్వప్న, రజిత, లక్ష్మి, ఆనందరావు తది తరులు పాల్గొన్నారు.

గుస్సాడి కనక రాజుకు నివాళులు



నివాళులు అర్పిస్తున్న అదనపు కలెక్టర్, ఐటీడీ పీవో

జైనూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్త మండలంలోని మార్లవాయిలో కనకరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుస్సాడి కళను ప్రపంచానికే పరిచయం చేసిన కనకరాజు సేవలు మరవలేని వన్నారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి, మాజీసర్పంచ్ కనకప్రతిభ, నాయకులు కనక వెంకటేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తునికాకు బోనస్ ఇవ్వాలి: ఖర్జీ గ్రామస్థులు



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్, అక్టోబు 28 (ఆంధ్రజ్యోతి): 2024ఏడాదికి సంబంధించిన తునికాకు సేకరణ బిల్లులు, బోనస్ ఇవ్వాలని కోరుతూ సోమవారం దహెగాం మండలం ఖర్జీ గ్రామస్థులు జిల్లా అటవీ కార్యాలయం ఎదుట ఆదివాసీసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016నుంచి తునికాకు బోనస్ పెండింగ్‌లో ఉందని అనేకసార్లు పోరాటం చేయడంతో బీఆర్ఎస్ ప్రభుత్వం బోనస్ చెల్లించిందన్నారు. కాని జిల్లాలో దాదాపు 3వేలమందికి ఇంకా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వెంటనే చెల్లించాలని కోరుతూ కార్యాలయ పరిపాలనాధికారి కృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మాలశ్రీ, బక్కన్న, హనుమంతు, సుగుణ, లక్ష్మి, గణేష్, వెంకటమ్మ, పోశక్క, శంకర్, బుచ్చన్న, నరేష్, పాపయ్య, అంజన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలు వెంటనే పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

కాగజ్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అధికారులకు సూచించారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజాఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజాఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెద్దచెరువు మత్తడికి మరమ్మతులు చేపట్టాలి

పెంచికలపేట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపల్లి గ్రామంలో గతంలో కురిసిన వర్షాలకు పెద్దచెరువు మత్తడి దెబ్బతిందని వెంటనే మరమ్మతులు చేప ట్టాలని రైతులు కాగ జ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరువుకింద ఉన్న 200మంది ఆయకట్టు రైతులు నష్టపోతున్నారని మరమ్మతులు చేయించాలని కోరారు.

మీట నొక్కితే.. తక్షణ సాయం

- జాతీయ రహదారిపై ఎస్‌వోఎస్ కేంద్రాలు
- ఏ సంఘటన జరిగినా అందుబాటులో సిబ్బంది
- తక్షణ సహాయానికి పెట్రోలింగ్ వాహనం



వాంకిడిలో ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఎస్‌వోఎస్

వాంకిడి, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఎక్కడో ఓ చోట ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. వాహనాలు పలుకారణాలతో నిలిచిపోతుంటాయి. ప్రమాదాల్లో గాయపడిన కొంతమందికి సమయానికి వైద్యం అందక ప్రాణాలు కోల్పోతుంటారు. ఈ సమయంలో ఎవరికి ఫోన్‌చేయాలో కూడా తెలియని ఆందోళన పరిస్థితి ఉంటుంది. ఈ సమస్యకు పరిష్కారంగా జాతీయ రహదారులపై ఎస్‌వోఎస్(సేవ్ అవర్ సోల్) ఫోన్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది ప్రభుత్వం. దీని ద్వారా వివిధ సేవలు తక్షణం పొందే వీలుంది.

వాంకిడి మండలంలోని గోయేగాం సరిహద్దు నుంచి మంచిర్యాల వరకు 94కిలోమీటర్లు జాతీయరహదారి విస్తరించి ఉంది. మార్గ మధ్యలో ఆసిఫాబాద్, రెబ్బెన, తాండురు, బెల్లంపల్లి, మందమర్రి మండలాలు ఉన్నాయి. ఈమార్గంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ఎస్‌వోఎస్ ఫోన్ సౌకర్యాన్ని కల్పించారు. రోడ్డు ప్రమాదం జరిగి నప్పుడు తొలిగంటలను గోల్డెన్ అవర్‌గా చెబుతారు. తీవ్రంగా గాయపడిన వారిని ఈ సమయంలో ఆసుపత్రికి తరలిస్తే ప్రాణం కాపాడేందుకు అవకాశం ఉంటుంది. ప్రయాణికుల సౌకర్యార్థం ఎన్‌హెచ్ఏఐ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

● ఘటనా స్థలికి అంబులెన్స్..

జాతీయ రహదారిపై ఏదైనా సంఘటన జరిగితే ఎస్‌వోఎస్ ఫోన్ ద్వారా అంబులెన్స్ అవసరమని చెబితే వాహనం సంఘటనా స్థలికి చేరుకుంటుంది. క్షతగాత్రులకు వైద్యసేవలు అందించి సమీప ఆసుపత్రికి తీసుకెళ్తారు. సహాయకేంద్రం వద్ద ఎల్లప్పుడూ అంబు లెన్స్ అందుబాటులో ఉంటుంది. వాహనాలు మరమ్మతులకు గురైతే క్రేన్‌కూడా సంఘటన స్థలికి పంపిస్తారు. దాని సాయంతో మర మ్మతు కేంద్రానికి తరలిస్తారు. వాహనంలో ఇంధనం అయిపోయినా, అటవీ ప్రాంతంలో వాహనం నిలిచిపోయినా, పెట్రోలింగ్ వాహనం ఘటనా స్థలికి వచ్చేస్తుంది.

● క్షణాల్లో సమాచారం...

రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన ఎస్‌వోఎస్ ఫోన్ డబ్బాపై బటన్ నొక్కితేచాలు దాని ఆయా పరిధిలోని సహాయ కేంద్రానికి కొన్నిక్షణాల్లో సమాచారం చేరుతుంది. అక్కడినంచి వాహనం ఘటనాస్థలికి చేరుతుంది. జిల్లాలోని వాంకిడి, మంచిర్యాల జిల్లాలోని మందమర్రి టోల్‌ప్లాజా వద్ద ఈ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి 2కిలోమీటర్లకు ఎస్‌వోఎస్ ఫోన్లు ఉన్నాయి. హైవేపెట్రోలింగ్ సిబ్బంది వాటిని తరచూ తనిఖీచేసి లోపాలుంటే సరిచేస్తుంటారు. ప్రధానంగా సెల్‌ఫోన్‌లో సిగ్నల్ ఉండని ప్రాంతాల్లో ఇవెంతో ఉపయోగపడతాయి.

ఎస్‌వోఎస్ ఫోన్ ఎంతో ఉపయోగం

- అల్లోజు రవింద్రప్రసాద్, వాంకిడి



జాతీయరహదారిపై ఏర్పాటుచేసిన ఎస్‌వోఎస్ ఫోన్ సదుపాయం ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఒకరోజు మందమర్రి సమీపంలో అకస్మాత్తుగా కారు చెడిపోవడంతో ఎస్‌వోఎస్ ఫోన్‌తో సమాచారం అందించాను. తక్షణమే పెట్రోలింగ్ వాహనం వచ్చి సహాయం అందించారు. వాంకిడి మండల సమీపంలో పలుమార్లు వాహనాలు నిలిచిపోయిన సమయంలోనూ ఎస్‌వోఎస్ బటన్ నొక్కగా తక్షణమే స్పందించి పోట్రోలింగ్ వాహనం వచ్చి సహాయసహకారాలు అందించారు. ఏదైనా ప్రమాదం జరిగినా, ఇందనం లేక వాహనాలు నిలిచినా ఎస్‌వోఎస్ బటన్ నొక్కితే వెంటనే స్పందించి సహాయం చేస్తున్నారు. ప్రయాణికులకు, వాహనదారులకు ఈ విధానం ఎంతో మేలు చేస్తోంది.

ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తారని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన గోలెం గంగ చీపురుదుబ్బ గ్రామశివారులో పట్టాభూమిలో వంశపారంపర్యంగా తనకురావాల్సిన వాటాభూమిని ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. పెంచికలేపట మండలం పోతెపల్లి గ్రామానికి చెందిన అల్లూరి అజయ్‌కుమార్ తనకు కంటిచూపు లేనందున సదరం శిబిరంలో పరీక్షనిర్వహించి ధ్రువపత్రం మంజూరు చేయాలని, కౌటాల మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన రైతులు తమ భూములకు సాగునీరు అందించాలని, వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. కెరమెరి మండలం గోయగాం గ్రామానికి చెందిన పవార్ రాము తనఇంటిపై ఉన్న కరెంటుతీగలు తొలగించాలని దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం ఇందిరానగర్‌కు చెందిన నరేష్ సింగరేణి భూసేకరణలో భూమి పోయిందని తనకు ఉపాధి కల్పించాలని, రాళ్లపేట గ్రామానికి చెందిన శ్రీనివాస్ వంకులం జీపీలో మల్టీపర్పస్ కార్మికుడిగా పనిచేస్తుండగా అన్యాయంగా తొలగించారని తిరిగి నియమించాలని దరఖాస్తు సమర్పించారు. ఆసిఫాబాద్‌పట్టణానికి చెందిన ఓదెలు తన భార్య, కుమారులు దివ్యాంగులు అయినందున పోషణకు ఇబ్బందిగా ఉందని తనకు ఉపాధి కల్పించాలని, రెబ్బెన మండలం తక్కళ్లపల్లికి చెందిన బండపోశం గ్రామశివారులో పట్టాభూమికి పాసుపుస్తకం అందించాలని, దహెగాంమండలం దిగిడ,రాంపూర్ గ్రామానికి చెందిన మారుబాయి పట్టాభూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని దరఖాస్తు అందజేశారు.

ప్రతి దండారికి రూ.15వేలు

● ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా

ఆసిఫాబాద్, అక్టోబరు 28: ప్రతి దండారికి ప్రభుత్వం రూ.15 వేల చొప్పున కేటాయించిందని సమగ్ర గిరిజన అభివృద్ధి అధికారి ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి అనసూయ సహకారంతో వెయ్యి గ్రామాల్లో దండారికి రూ.15వేల చొప్పున ప్రభుత్వం రూ.1.50కోట్లు దీపావళి కానుకగా కేటాయించిందన్నారు.

బదిలీపై వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్‌కు సన్మానం

సిర్పూర్(టి), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): బదిలీపై మంచిర్యాలకు వెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్ వీరస్వామిని ఎస్సై కమలాకర్, పోలీసు సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్ప వన్నారు. ఏ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించినా మంచిపేరు ప్రతిష్ఠలు సంపాదించాలన్నారు.

సీఐకి సన్మానం

ఆసిఫాబాద్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ సీఐగా బాధ్యతలు చేపట్టిన బుద్దే రవీందర్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్యాం, గోపాల్, మహేష్‌గౌడ్, దత్తు, శ్రీనివాస్, కిరణ్, రాము, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కుమరం సూరు వర్ధంతి

జైనూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కమరం సూరు వర్ధంతిని మండలంలోని జంగాంలో సోమవారం ఆదివాసులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కొలాం సంఘం ఉపాధ్యక్షుడు టేకం వసంత్‌రావ్, గౌరవ అధ్యక్షుడు ఆత్రం బాలేరావ్ తదితరులు కొలాం ఆదివాసులతో కలిసి కుమరం సూరుకు నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జల్, జంగల్, జమీన్ కోసం నిజాం సర్కారుతో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన ఉద్యమ వీరుల విగ్రహాలను ప్రతి గామం, మండలాల్లో నెలకొల్పాలని కోరారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కుమర శాంరావ్, మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్, కొలాం సంఘం జిల్లా నాయకులు ఆత్రం శంకర్, కొడప నగేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పీవీటీజీల అభివృద్ధికి చర్యలు: ఎమ్మెల్యే కోవ లక్ష్మి



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ తెగల్లో వెనకబడ్డ తెలగలైన పీవీటీజీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కోవ లక్ష్మి తెలిపారు. మండలంలోని ఆదివాసీ గ్రామమైన బనార్‌గొంది, కుటోదలో ప్రధాన మంత్రి జన్‌మన్‌పథకం ద్వారా రూ.60 లక్షలవ్యయంతో నిర్మించతలపెట్టిన బహుళార్థక భవననిర్మాణాలకు సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచం అభివృద్ధి పథంలో దూసుకు పోతుంటే ఆదివాసీలు ఇంకా వెనకబడి ఉండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. వారి అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఆదివాసులు ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్ అహ్మద్, డీఈ నిజాముద్దీన్, రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

జైనూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జెండాగూడకు చెందిన సాయిశ్రద్ధ ఇటీవల నీట్‌లో సీటు సాధించడం గొప్ప విషయమని ఉట్నూరు ఏపీవో మేస్రం మనోహర్ అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుంటు ఆదివాసులు విద్యలో రాణించాలని కోరారు. ఈ సందర్భంగా సాయిశ్రద్ధకు చదువు కోసం అభిమన్యు గ్రూపు సభ్యులు వాట్సాప్‌ద్వారా సేకరించిన రూ.61వేల నగదును ఆ గ్రూపు సభ్యులతో కలిసి సాయిశ్రద్ధకు అందజేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పూరబాపూరావ్, జిల్లాసార్మేడి మేస్రాం దుర్గపటేల్, మేస్రాం బాదు తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) పశువైద్యాధికారిగా భవిత

సిర్పూర్(టి), అక్టోబరు 28: మండలపశువైద్యాధికారిగా సోమవారం డాక్టర్ భవిత బాధ్యతలు చేపట్టారు. మండలంలోని రైతులు వైద్యసిబ్బంది సేవలనుసద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఆమెను సన్మానించారు.

డిగ్రీ చదువుతూ మిర్చి పంట సాగు చేస్తున్న యువకుడు



మిర్చిపంట సాగు చేస్తున్న విద్యార్థి కైలాస్

సిర్పూర్(టి), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుడ్కిలి గ్రామానికిచెందిన కైలాస్ వ్యవసాయంపై మక్కువతో తండ్రి దగ్గర రూ.1.20లక్షలు, రెండెకరాల భూమి తీసుకుని స్వతహాగా మిర్చిపంటను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం కైలాస్ కాగజ్‌నగర్ పట్టణంలోని ఎస్‌కేఈ డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. తనకు వ్యవసాయపనులు ఎంతో సంతృప్తినిస్తాయని కైలాస్ పేర్కొంటున్నాడు.

మిర్చిపంట రెండు ఎకరాల్లో 25క్వింటాళ్ల దిగుబడి వస్తుందని భావిస్తున్నానని తెలిపాడు. ఈసారి మార్కెట్‌లో మిర్చి ధర కింటాలుకు రూ.15వేలు ఉన్నట్లయితే తనకు పెట్టుబడి పోను రెండునుంచి మూడు లక్షలు లాభం వస్తుందని తెలిపాడు. యాసంగిలో శనగ, గోధుమ, మినుములు పంటలు సాగు చేస్తానని పేర్కొన్నాడు.